సాక్షి
కర్నూలు
ఆదివారం 23 జూన్ 2024



మహానందిలో వీకెండ్ సందడి

మహానంది: మహానంది క్షేత్రానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. స్థానిక కోనేర్లలో స్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర స్వామిని దర్శించుకున్నారు.



మద్దిలేటయ్య క్షేత్రం కిటకిట

బేతంచెర్ల: శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఒక్క రోజు ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.3,80,176 ఆదాయం వచ్చింది.



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు.


ఆకు కూరను తెంచుతున్న మహిళా కూలీలు



సున్నితమైన ఆ చేతి వేళ్లు సస్యాలను పండించగలవు.. కరకు మట్టిని మృదువుగా చేయగలవు.. పచ్చని పైరుకు జవసత్వాలను ఇవ్వగలవు.. దుక్కి దున్నడం నుంచి కలుపుతీయడం, పంట నూర్పడం వరకు అన్ని పనుల్లో మహిళలు ఆరితేరారు. స్వేదాన్ని చిందిస్తూ.. సేద్యానికి ఊపిరిలూదుతున్నారు. వ్యవసాయంలో మమేకమవుతూ పుడమితల్లికి సౌభాగ్యాన్ని అందిస్తున్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా శనివారం కోడుమూరు సమీపంలోని పొలాల్లో పనులు చేస్తున్న మహిళల దృశ్యాలు ఇవీ..

–ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు


దుక్కి దున్నుతున్న మహిళ


కలుపుతీస్తూ...

న్యూస్‌రీల్

ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రతి సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో స్పందనలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేవారమని, ప్రభుత్వం మారడంతో దాని పేరును ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికగా మార్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. సమస్యలు ఉన్న ప్రజలు తమ ఫిర్యాదులను అర్జీల రూపంలో అధికారులకు సమర్పించుకొని, పరిష్కారాలు పొందాలని ఆమె సూచించారు.

న్యాయమూర్తులకు అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

కర్నూలు (లీగల్): జిల్లా కోర్టు హాలులో శనివారం న్యాయమూర్తులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు నేతృత్వం వహించారు. కొత్తగా అమల్లోకి వచ్చిన క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు భూపాల్ రెడ్డి, ప్రతిభా దేవి, పాండురంగారెడ్డి, మురళీకృష్ణ, వాసు హాజరయ్యారు.

ముగ్గురికి 'కారుణ్య' ఉద్యోగాలు


నియామకపత్రాలను అందుకున్న వారితో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, జెడ్పీ సీఈఓ

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో కారుణ్య నియామకాల్లో భాగంగా ఖాళీగా ఉన్న కార్యాలయ సహాయకుల పోస్టుల భర్తీకి సంబంధించి ముగ్గురికి ఉద్యోగాలు కల్పించినట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వులను అనుసరించి అభ్యర్థుల అర్హత, అభీష్టం మేరకు కౌన్సెలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులను అందించామన్నారు. జీ పవన్‌కుమార్ యాదవ్‌ను జూపాడుబంగ్లా మండల పరిషత్ కార్యాలయం, వి అఖిల్‌దీపక్‌ను కోసిగి ఎంపీపీ, ఎస్ వినోద్‌కుమార్‌ను అవుకు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయానికి నియమించామని పేర్కొన్నారు.

ఎంపిక జాబితా విడుదల

కర్నూలు(హాస్పిటల్): స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో రేడియోథెరపీ టెక్నీషియన్ పోస్టుల ఫైనల్ మెరిట్, ఎంపిక జాబితాను కర్నూలు, నంద్యాల జిల్లాల వెబ్‌సైట్‌లో ఉంచినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలను https://kurnool.ap.gov.in, https://nandyal.ap.gov.in, కర్నూలు మెడికల్ కాలేజీ వెబ్‌సైట్ https://kurnoolmedicalcollege.ac.inలలో చూడాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 24, 25వ తేదీల్లో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

అట్టహాసంగా పట్టాభిషేకం

- ట్రిబుల్‌ఐటీ డీఎంలో స్నాతకోత్సవ సంబరం
- ఐదుగురికి బంగారు పతకాలు
- 143 మంది విద్యార్థులకు బీటెక్ డిగ్రీ సర్టిఫికెట్ల ప్రదానం
- హాజరైన నీతి ఆయోగ్ సభ్యుడు, జేఎన్‌యూ చాన్స్‌లర్ డాక్టర్ వీకే సారస్వత్


బీటెక్ పట్టాలు అందుకున్న ఆనందంలో విద్యార్థులు


సాయి ఘణాష్యంకు గోల్డ్ మెడల్ అందజేస్తున్న నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ సారస్వత్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు శివారులోని జగన్నాథ గట్టుపై ఉన్న ఐఐఐటీడీఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్)లో ఆరవ స్నాతకోత్సవాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. 2020–24 విద్యా సంవత్సరంలో బీటెక్ కోర్సులు పూర్తి చేసిన 143 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఆయా విభాగాల్లో ప్రతిభ చాటిన ఐదుగురికి బంగారు పతకాలు అందజేశారు. ఐఐఐటీడీఎం బోర్డుఆఫ్ గవర్నెన్స్ చైర్మన్, డైరక్టర్ బీఎస్ మూర్తి సమక్షంలో నిర్వహించిన ఈ మహోత్సవానికి నీతి అయోగ్ సభ్యుడు, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ వీకే సారస్వత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకెళ్లాలన్నారు. చదవడమంటే పాసు కావడం కాదని, సబ్జెక్టుపై సంపూర్ణంగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. మంచి మార్కులతో డిగ్రీలు పొందితే ఉద్యోగాలకు కొదవ ఉండదన్నారు. ట్రిబుల్ ఐటీడీఎం డైరక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ.. ఇక్కడ చదివిన ఎంతో మందికి మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయన్నారు. కొందరు మాస్టర్స్ చదవడానికి విదేశాలకు వెళ్లారన్నారు. కళాశాలలో అన్ని రకాల మౌలిక వసతులు ఉన్నాయని, కొద్ది సంవత్సరాల్లోనే దేశంలోనే నంబర్ వన్‌గా కర్నూలు ఐఐఐటీ డీఎం నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



సెల్ఫీలు దిగుతూ..

స్నాతకోత్సవంలో సందడి...

స్నాతకోత్సవం సందర్భంగా ట్రిబుల్‌ఐటీ డీఎంలో సందడి నెలకొంది. ప్రొఫెసర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషంతో కనిపించారు. తమ కుమారుడు, కుమార్తె మంచి మార్కులతో పాసు కావడంతో భవిష్యత్‌కు భరోసా ఉంటుందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. బీటెక్ పట్టాలు తీసుకున్న అనంతరం విద్యార్థులు సెల్ఫీలు దిగారు.

గోల్డ్ మెడలిస్టులు వీరే...

ట్రిపుల్ ఐటీడీఎంలో ఐదు ఇంజినీరింగ్ కోర్సులు ఉన్నాయి. కంప్యూటర్ సైన్స్‌లో పరాస్ యాదవ్, చేబ్రోలు వర్ష టాపర్లుగా నిలిచారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అండ్ డేటాసైన్స్‌లో విభాగంలో మోహిత్ సింగ్, ఈసీఈ విభాగంలో ఇమ్మడిశెట్టి శ్రీప్రియ, మెకానికల్ విభాగంలో సాయి ఘణాష్యం టాపర్లుగా నిలిచి బంగారు పతకాలు అందుకున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌అండ్ డేటా సైన్స్‌లో 28, కంప్యూటర్ సైన్స్‌లో 83, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 32..మొత్తం 143 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేశారు. వీరిలో కొంతమంది ఉద్యోగాలకు ఎంపిక కాగా, కొందరు మాస్టర్స్ చదవడానికి, మరికొందరు ఇంటర్న్‌షిప్ చేయడానికి అవకాశాలు దక్కించుకున్నారు.

ఓవరాల్ టాపర్‌గా కర్నూలు విద్యార్థి

ట్రిపుల్‌ఐటీ డీఎంలో 2024 ఓవరాల్ టాపర్‌గా కర్నూలు చెందిన సాయి ఘణాష్యం నిలిచారు. ఈ విద్యార్థి 2020లో జేఈఈ మెయిన్స్‌లో మంచి ర్యాంకు సాధించి ఇక్కడ మెకానికల్ ఇంజినీరింగ్ చేరారు. మంచి మార్కులు తెచ్చుకోవడంతో ఓవరాల్‌గా టాపర్‌గా నిలిచాడు. ఇతని తల్లిదండ్రులు కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని మెగాసిరిలో నివాసం ఉంటారు. తండ్రి నరసింహులు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఓవరాల్ టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ అందుకోవడం చాలా సంతోషంగా ఉందని సాయి ఘణాష్యం తెలిపారు. విదేశాల్లో మాస్టర్స్ చదవడానికి తనకు అవకాశం వచ్చిందని చెప్పారు.

గూగుల్‌లో ఉద్యోగం వచ్చింది



మాది ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం. ఇక్కడ వాతావరణం చాలా బాగుంది. మొదట ఇక్కడ ఎన్ని ఇబ్బందులు పడతానేమోనని భయపడ్డా. ఇక్కడ ఉండే వారు చాలా మంచి వారు. నేను సక్సెస్ ఫుల్‌గా కోర్సును పూర్తి చేశానంటే ప్రొఫెసర్స్ చలువే. నాకు గూగుల్‌లో ఏడాదికి రూ.27 లక్షల వేతనంతో ఉద్యోగం వచ్చింది.

– పరాస్ యాదవ్, గోల్డ్ మెడలిస్టు, కంప్యూటర్ సైన్స్ విభాగం

క్యాంపస్ చాలా బాగుంది



మాది గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మాచవరం. నేను కంప్యూటర్ సైన్స్ విభాగంలో బీటెక్ పూర్తి చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇంటర్న్‌షిప్ కోసం ఎంపికయ్యా. భవిష్యత్‌లో మంచి ఉద్యోగం సాధించడమే లక్ష్యం. కర్నూలు క్యాంపస్ చాలా బాగుంది. ఇక్కడి సదుపాయాలు బాగున్నాయి.

– చేబ్రోలు వర్ష, గోల్డు మెడలిస్టు, కంప్యూటర్ సైన్స్ విభాగం

ఇంటర్న్‌షిప్ కోసం ఎంపికయ్యా



మాది నెల్లూరు సిటీ. మా తల్లిదండ్రులు వ్యాపారం చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇక్కడ 2020లో బీటెక్ ఈసీఈ విభాగంలో చేరా. ఈసీఈ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించడం చాలా సంతోషంగా ఉంది. ఇంటర్న్‌షిప్ కోసం ఎంపికయ్యా.

– ఇమ్మిడిశెట్టి శ్రీప్రియ, గోల్డుమెడలిస్టు, ఈసీఈ విభాగం

జిల్లా కలెక్టర్‌గా రంజిత్ బాషా

- బాపట్ల నుంచి కర్నూలుకు బదిలీ
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా సృజన



కర్నూలు సెంట్రల్: జిల్లా నూతన కలెక్టర్‌గా పి.రంజిత్ బాషా నియమితులయ్యారు. 2013 బ్యాచ్‌కి చెందిన ఈయన ప్రస్తుతం బాపట్ల జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. అక్కడి నుంచి కర్నూలు జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ కలెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి సృజనను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ఆమె దాదాపు 14 నెలలు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. జిల్లాలో తొలి మహిళ కలెక్టర్‌గా పనిచేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించి తన మార్కు పాలనను చేశారు.

కలెక్టర్‌గా నందికొట్కూరు వాసి

జిల్లా కలెక్టర్‌గా నియమితులైన పి.రంజిత్ బాషా నంద్యాల జిల్లా నందికొట్కూరు వాసి. ఆయన అక్కడే పుట్టి పెరిగి చదువుకున్నారు. చిన్నతనంలోనే తండ్రి మరణించగా.. తల్లి అలీమా బీ కూలి పనులు చేసి ఆయనను చదివించారు. ఆమె ఆశలు అనుగుణంగా చదివి కలెక్టర్ అయ్యారు. ప్రస్తుతం పి.రంజిత్ బాషా కర్నూలు జిల్లా కలెక్టర్‌గా వస్తున్నారు. దీంతో సన్నిహితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటిదాకా నందికొట్కూరు కర్నూలు జిల్లాలోనే ఉండేది. జిల్లాల పునర్విభజనతో అది నంద్యాల జిల్లాలోకి వెళ్లింది.

డయేరియా ప్రబలకుండా పకడ్బందీ చర్యలు

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): డయేరియా ప్రబలకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని ఆమె ప్రజలకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో డయేరియా నివారణలో (స్టాప్ డయేరియాక్యాంపెయిన్) భాగంగా వైద్యాధికారులు, మునిసిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని ఆమె తన అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో మే మొదటి వారం నుంచి వర్షాలు పడుతున్నందున మలేరియా, డెంగ్యూ, డయేరియా ప్రబలే అవకాశం ఉందన్నారు. మునిసిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు సంయుక్తంగా మంచినీటి ట్యాంకులు, పైపులను శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి నమూనాలను పరీక్షించి సురక్షితమైతేనే సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డయేరియా నివారణపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటిని వేడి చేసుకొని చల్లార్చుకొని తాగాలని, భోజనం చేసే ముందు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని సూచించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్‌ఎస్, జింక్ ట్యాబ్లెట్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జాతరలు, ఉత్సవాలు, పెళ్లిళ్లలో కూడా శుభ్రమైన తాగునీరు, భోజనం, తీసుకునేలా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు తనిఖీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని డీపీఓకు సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్, నగర పాలకసంస్థ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, అదనపు డీఎంహెచ్‌ఓ భాస్కర్, డీఈఓ శామ్యూల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వర రావు, ఐసీడీఎస్/బీసీసంక్షేమాధికారి వెంకట లక్ష్మమ్మ, డీపీఓ నాగరాజునాయుడు, మలేరియా అధికారి నూకరాజు, డీసీహెచ్‌ఎస్‌మాధవి, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ భాస్కరరెడ్డి, డెమో ప్రమీలాదేవి పాల్గొన్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 37,500 భూసార పరీక్షలు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లకు కలిపి 37,500 భూసార పరీక్షలు నిర్వహించే విధంగా వ్యవసాయ శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లాకు లక్ష్యాలను ఇచ్చింది. కర్నూలు జిల్లాలో 19,500, నంద్యాల జిల్లాలో 18,000 ప్రకారం మట్టి పరీక్షలు నిర్వహిస్తారు. మొత్తం లక్ష్యంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 70, రబీ సీజన్‌కు సంబంధించి 30 శాతం భూసార పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఆర్‌బీకే ఇన్‌చార్జీలు మట్టి నమూనాలను తీసి ల్యాబ్‌కు పంపుతారు. కర్నూలు జిల్లాకు మట్టి నమూనాలను ఎమ్మిగనూరులోని భూసార పరీక్ష కేంద్రానికి, నంద్యాల జిల్లావి కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో భూసార పరీక్ష కేంద్రానికి పంపుతారు. కర్నూలు జిల్లాలో 466 ఆర్‌బీకేలు ఉండగా.. ఒక్కో ఆర్‌బీకే ఇన్‌చార్జీ 42 మట్టి నమూనాలు సేకరించాల్సి ఉంది. నంద్యాల జిల్లాలో 411 ఆర్‌బీకేలు ఉండగా... ఒక్కో ఆర్‌బీకే ఇన్‌చార్జీ 44 మట్టి నమూనాలు సేకరించాల్సి ఉంది.


ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్

'ఒలింపిక్' స్ఫూర్తి

ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కర్నూలులో రన్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ కృష్ణకాంత్ రైల్వే స్టేషన్ సర్కిల్‌లో క్రీడా జ్యోతులను వెలిగించారు. అనంతరం జిల్లా ఒలింపిక్ సంఘం, జిల్లా క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రన్‌లో విద్యార్థులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

–కర్నూలు టౌన్

క్లుప్తంగా

ఫారెస్టర్లకు పదోన్నతి

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ కర్నూలు సర్కిల్ పరిధిలో పలువురు ఫారెస్టర్లకు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లుగా పదోన్నతులు కల్పించారు. ఈమేరకు కర్నూలు సర్కిల్ చీఫ్‌కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ పి.రామకృష్ణ ఉత్వర్వులు జారీ చేశారు. ఆత్మకూరు డివిజన్ ఫారెస్టర్ బి. ఓబులేసుకు పదోన్నతి కల్పించి కర్నూలు డివిజన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా నియమించారు. నంద్యాల డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్.అన్వర్ హుసేన్‌ను వైఎస్సార్ కడప డివిజన్‌కు, కర్నూలు డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న జి.నూర్జహాన్‌బీని రాయచోటి రేంజ్ అన్నమయ్య డివిజన్‌కు, ఆత్మకూరు డివిజన్‌కు చెందిన బి.పి. గురవయ్యను కోడూరు రేంజ్ అన్నమయ్య డివిజన్‌కు, ఆత్మకూరు డివిజన్‌కు చెందిన సి. నాగేశ్వరరావును కడప సోషల్‌ఫారెస్ట్ డివిజన్‌కు , నంద్యాల డివిజన్‌కు చెందిన ఎస్.రవింద్రనాయక్‌ను డోన్ రేంజ్ నంద్యాల డివిజన్‌కు నియమించారు. ఉత్తర్వులు వెలువడిన నాటి నుంచి 15 రోజుల్లోగా విధుల్లో చేరాలని సీసీఎఫ్ ఉత్వర్లుల్లో పేర్కొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ జలీల్

మహానంది: నంద్యాల–గిద్దలూరు రైల్వే మార్గంలోని గాజులపల్లె రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ జలీల్, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 60 ఏళ్ల వరకు ఉండవచ్చని, రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామన్నారు.

ప్యాఫ్టో కో–చైర్మన్‌గా ప్రకాష్‌రావు



కర్నూలు సిటీ: ప్యాఫ్టో రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం విజయవాడలో జరిగింది. ఈ సమావేశంలో ప్యాఫ్టో కో–చైర్మన్‌గా ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్‌రావు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో జిల్లాలో ప్యాఫ్టో ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక ఉద్యమాల్లో ప్రకాష్‌రావు కీలకంగా పని చేశారు. ప్రకాష్‌రావు ఎంపికపై అప్టా జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయక్, నంద్యాల జిల్లా అధ్యక్షులు అజీజ్, ప్రధాన కార్యదర్శి రఫీ హర్షం వ్యక్తం చేశారు.

యువ గుండెకు పోటు!

- 25 నుంచి 40 ఏళ్లలోపు వారిలో అధికంగా గుండెపోటు
- ఏటా ఐదువేల మందికి ఆరోగ్య సమస్య
- జీవనశైలి మార్పులే కారణం
- కోవిడ్ తర్వాత పెరిగిన కేసులు



కర్నూలు(హాస్పిటల్): ఇటీవల కాలంలో నగరం, పట్టణం అన్న తేడా లేకుండా యువత చనిపోయిన విషయాన్ని తెలియజేస్తూ పలు చోట్ల ఫ్లెక్సీలు ప్రదర్శిస్తున్నారు. ఈ ఫ్లెక్సీలను చూసిన వారంతా అయ్యో చాలా చిన్న వయస్సులోనే చనిపోయారని జాలిపడుతుండటం మనం గమనిస్తూ ఉంటాము. చనిపోయిన వారంతా 25 నుంచి 40 ఏళ్లలోపు వారే ఉండటం గమనార్హం. గతంలో ఎప్పుడూ ఈ వయస్సు వారు అర్ధంతరంగా తనువు చాలించలేదు. కానీ ఇటీవల కాలంలో యువత మరణాలు అధికమయ్యాయి. దీనికి కారణం జీవనశైలి మార్పులేనని వైద్యులు చెబుతున్నారు. వ్యాయామం లేకపోవడం, మితిమీరిన ఆహార సేవనం, దురలవాట్ల కారణంగా చిన్న వయస్సులో కన్నుమూస్తున్నారని వైద్యులు పేర్కొంటున్నారు.

ఒకప్పుడు గుండెపోటు అంటే ఏ అరయ్యేళ్లు దాటిన వారికి, అది కూడా ధనవంతులకు మాత్రమే వచ్చేది. ప్రస్తుతం పేద, ధనిక అన్న తేడా ఉండటం లేదు. యువత, వృద్ధులు అన్న భేదం లేదు. ఎవరికి ఎప్పుడు గుండెపోటు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు 60 ఏళ్లు దాటిన వారికి మాత్రమే వచ్చే గుండెజబ్బులు నేడు 20 ఏళ్లకే పలకరిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రికి గుండెచేతబట్టుకుని వస్తున్న వారిలో పాతికేళ్ల నుంచి 40 ఏళ్లలోపు వారు ఇటీవల కాలంలో అధికంగా ఉన్నారు. ఇప్పటికే జిల్లాలో 10 శాతం మంది ప్రజలు గుండెజబ్బులతో బాధపడుతున్నట్లు గతంలో నిర్వహించిన ఓ సర్వేలో నిర్ధారణ అయ్యింది. ఆసుపత్రులకు చికిత్స కోసం వస్తున్న వారిలో 5 శాతం మంది యువతే ఉంటున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు వంశపారంపర్యం, జన్యు లోపాలు, మేనరికపు వివాహం వంటి కారణాలతో పుట్టుకతోనే గుండెజబ్బులతో జన్మించే పిల్లలూ ఇటీవల అధికమయ్యారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజీ విభాగానికి మంగళ, శుక్రవారాల్లో ఓపీ రోగులకు చికిత్స చేస్తారు. ప్రతి ఓపీ రోజున రోగుల సంఖ్య 200 నుంచి 250లకు ఉంటోంది. నెలకు ఇన్‌పేషంట్లుగా 300 మంది దాకా చేరి చికిత్స పొందుతున్నారు. నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లోని కార్డియాలజిస్టుల వద్దకు ప్రతిరోజూ 10 నుంచి పాతిక మంది చికిత్స కోసం వస్తున్నట్లు సమాచారం.

జీవనశైలిలో మార్పుల వల్లే...

పాశ్చాత్య సంస్కృతి కారణంగా ఆహారంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు పోషకాహారం చాలా తక్కువ మందికి మాత్రమే లభ్యమయ్యేది. కానీ ఇప్పుడు ఎక్కువ మందికి ఇది అందుబాటులోకి వచ్చింది. అందులో ఆయా ప్రాంతాల్లో సీజన్ వారీగా లభించే ఆహారంతో పాటు ఎక్కువగా ఇతర దేశాలు, రాష్ట్రాల్లో అక్కడ ప్రాచుర్యం పొందిన ఆహారం ప్రతిచోటా లభిస్తోంది. ఇందులో జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా ఉంటోంది. ప్రాంతాలను బట్టి ఆహారం స్థానిక ప్రజల ఒంటికి పడుతుంది. కానీ ఉత్తరాదిలో లభించే ఆహారం దక్షిణాలో తింటున్నారు. సాధారణంగా మన దేశంలో ఉత్తరాదిలో ఎక్కువ శాతం వాతావరణం చల్లగా ఉంటుంది. దక్షిణాదిలో కాస్త వేడిగా ఉంటుంది. ఆయా ప్రాంతాలను బట్టి ఆహారపు అలవాట్లు ఉంటాయి. కానీ ప్రాంతాలను బట్టి గాకుండా ఆహారాన్ని తినడం వల్ల శరీరంలో సమతుల్యత లోపిస్తోంది. దీంతో పాటు ఆహారంలో విపరీతంగా ఉప్పు, కారం, మసాలాలు, తీపి పదార్థాలు వేయడం వల్ల అవి తిన్న వారికి ఆరోగ్య సమస్యలు ఎక్కువవుతున్నాయి. దీనికితోడు ఎక్కువసేపు ఒకేచోట కూర్చుని పనిచేసే ఉద్యోగాలు కావడంతో ఊబకాయం పెరిగిపోతోంది. వ్యాయామం కూడా లేకపోవడంతో శరీరంలో కొవ్వు శాతం పెరిగిపోతోంది. ఫలితంగా అనేక అనారోగ్య సమస్యలు పలకరిస్తున్నాయి. అధిక చక్కెర, మాంసాహారం, వెన్న, నూనెలు వంటివి కొవ్వు పదార్థాలు గుండెజబ్బులు రావడానికి ముఖ్యపాత్ర వహిస్తాయి.

దురలవాట్ల వల్లే చిన్న వయస్సులోనే సమస్య



ఒకప్పుడు 45 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు వారిలో గుండెపోటు, సమస్యలు వచ్చేవి. ఇప్పుడు పాతికేళ్ల వయస్సులోనూ సమస్యలు వస్తున్నాయి. చిన్న వయస్సులోనే ఆల్కహాలు, ధూమపానం, గుట్కా నమలడంతో పాటు బయటి ఆహారం ఎక్కువగా తినడం, అందులో జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్ అతిగా తినడం వల్ల ఊబకాయం వస్తోంది. దీనికితోడు వ్యాయామం లేకపోవడం వల్ల శరీరంలో కొవ్వు శాతం పెరిగిపోతోంది. చిన్న వయస్సులోనే బీపీ, షుగర్లు వస్తున్నాయి. మానసిక ఒత్తిడి, స్మోకింగ్‌తో గుండె లయ తప్పుతోంది. దీనివల్ల ఉన్నఫలంగా గుండెపోటు వస్తోంది. నేను ఇప్పటి వరకు చేసిన కేసుల్లో 5 శాతం మంది యువకులే ఉన్నారు.

–డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

కోవిడ్ అనంతరం కేసులు పెరిగాయి



కోవిడ్–19 వచ్చిపోయిన తర్వాత గుండెపోటు, గుండె సమస్యలున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. కోవిడ్ వచ్చిపోయిన చాలా మందిలో రక్తనాళాల్లో బ్లాక్‌లు ఉంటున్నాయి. వీటివల్ల గుండెపోటు, పక్షవాతం వస్తున్నాయి. కోవిడ్‌కు గురైన వారు, ఊబకాయం, బీపీ, షుగర్ నియంత్రణలో లేని వారు వైద్యులను కలిసి వైద్యపరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఏదైనా సమస్య ఉంటే మందులతో పరిష్కరించుకోవాలి. దీనికితోడు ధూమపానం, మద్యపానం, ఊబకాయం ఉన్న వారిలోనూ గుండెపోటుకు గురయ్యే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఈ అలవాట్లు మానుకుని, రోజూ వ్యాయామం చేయడం, ఆహారం మితంగా తీసుకోవడం, అందులోనూ సమతుల ఆహారం తీసుకోవడం చేయాలి.

– డాక్టర్ చైతన్యకుమార్, కార్డియాలజిస్టు, కర్నూలు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గుండె, ఊపిరితిత్తుల శస్త్రచికిత్సల విభాగం

గుండెపోటు లక్షణాలు ఇవీ..

- కొద్దిదూరం నడవగానే ఆయాసం
- ఛాతీలో పట్టేసినట్లుగా ఉండటం
- చెమట ఎక్కువగా పడుతుండటం
- శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది పడుతుండటం ఉంటే గుండెజబ్బుగా అనుమానించాల్సి ఉంటుంది
- సమీప ఆసుపత్రికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకుని, అవసరమైన చికిత్స తీసుకోవాలి
- గుండెపోటు వచ్చిన మొదటి కొద్దినిమిషాలు కీలకమైనవి

ఇలా చేయడం మేలు..

- మద్యపానం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి.
- ప్రతిరోజూ వాకింగ్, యోగా, ధ్యానం చేయాలి.
- శాస్త్రీయ సంగీతం వినాలి. పాత పాటల్లోని సాహిత్యం మనస్సుకు ఎంతో హాయినిస్తుంది.
- లిఫ్ట్‌లో వెళ్లడం కంటే మెట్లు ఎక్కడమే మేలు.
- సమతుల ఆహారం వల్ల గుండెకు బలం చేకూరుతుంది.
- నూనెలో వేయించిన ఆహారాన్ని తగ్గించుకోవాలి. బయట లభించే ఫాస్ట్‌ఫుడ్స్, బేకరి ఫుడ్స్‌కు, దిగుమతి చేసుకున్న చికెన్ లెగ్స్‌కు దూరంగా ఉండాలి.
- బజ్జీలు తినాల్సి వస్తే ఇంట్లోనే చేసుకోవాలి.
- బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. స్థూలకాయం తగ్గించుకోవాలి.
- వయస్సుకు తగినట్లు నిద్రపోవాలి. నిద్రతగ్గితే శరీరం రోగాలను ఆహ్వానిస్తుంది.

రివైజ్డ్ ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్ విడుదల

కర్నూలు (హాస్పిటల్) : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీలు, జనరల్ హాస్పిటళ్లు, గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీలకు సంబంధించి 30 కేటగిరీల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు సంబంధించి రివైజ్డ్ ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్ విడుదల చేసినట్లు కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ గత సంవత్సరం నవంబర్ 21న విడుదల అయిందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల రివైజ్డ్ ప్రొవిజినల్ మెరిట్ లిస్టులు కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్లు https://kurnool.ap.gov.in,https://nandyal. ap.gov.in లలో అప్‌లోడ్ చేశామన్నారు. అభ్యర్థులు వారి మెరిట్ వివరాలను సరిచూసుకుని అభ్యంతరాలు ఏవైనా ఉంటే ఈనెల 24 నుంచి 28వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా సమర్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో పంపిన గ్రీవెన్స్, అభ్యంతరాలు అంగీకరించబోమని పేర్కొన్నారు.


గుడేకల్‌లో ఎద్దుల పార్వేట నిర్వహిస్తున్న గ్రామస్తులు


పుష్ప–2లో అల్లుఅర్జున్ గెటప్‌తో తగ్గేదిలే అంటున్న యువకులు


ప్లాస్టిక్ సంచుల డ్రెస్లతో ప్రదర్శన..

ఘనంగా ఏరువాక సంబరాలు

- హీరోల గెటప్‌లతో ఆకట్టుకున్న యువకులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో శనివారం సాయంత్రం ఏరువాక సంబరాలు అంబరాన్ని అంటాయి. వృషభాలను అందంగా అలంకరించి పారువేట వందలాది మధ్య ఘనంగా నిర్వహించారు. పారువేటలో వృషభం తెంచిన ఆకులను తీసుకునేందుకు ప్రజలు ఎగబడ్డారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. గ్రామంలో జరిగిన వేడుకల్లో వీరశైవ లింగాయితి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, పెద్దలు హాజరయ్యారు.

ఆదిరేటి డ్రెస్ మేమేస్తే

ఆదిరేటి డ్రెస్ మేమేస్తే అంటు ఏరువాక పౌర్ణమిని పురష్కరించుకొని గ్రామంలోని యువకులు తమకు నచ్చిన హీరోల గెటప్స్‌తో ఊరేగింపుగా వస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు. అల్లుఅర్జున్ పుష్ప–2, జూనియర్ ఎన్టీఆర్ దేవర, విక్రమ్‌లో కమల్‌హాసన్ గెటప్‌లో అదరగొట్టారు. ప్లాస్టిక్ సంచులను డ్రెస్‌లుగా కుట్టించుకొని వేసుకోవటం, కత్తులను నోట్లు పెట్టుకొని, గొడుగులు పట్టుకొని యువకుల వేషధారణ అదుర్స్ అనిపించాయి. వీరితో పాటు ఒకే రకం దస్తులు ధరించి మరికొందరులు యువకులు ఆకట్టుకున్నారు.


రంగులు వేసుకొని కత్తులను నోట్లో పట్టుకుకొని గెటప్‌లో యువకులు

26న సర్పంచ్‌ల సమావేశం

కర్నూలు(అర్బన్): జిల్లాలో 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం పర్యటన సందర్భంగా ముందుగా ఈ నెల 26న స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 10.30 గంటలకు పంచాయతీరాజ్ సంస్థల అధికారులు, సర్పంచులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక సంఘం అధ్యక్షులు, సభ్యులు పాల్గొంటున్న ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల ఆదాయాలు, ఖర్చులపై, పన్నుల వసూళ్లలో ఏర్పడే ఇబ్బందులు, స్థానిక ప్రాథమిక అవసరాలు, స్థానిక పాలనలో ప్రజా భాగస్వామ్యం తదితర విషయాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన డివిజినల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీఓ, ఈఓఆర్‌డీలతో పాటు రెండు జిల్లాల నుంచి ఎంపిక చేసిన ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు, ఒక్కో మండలం నుంచి ఎంపిక చేసిన ఇద్దరు గ్రామ సర్పంచులు హాజరు కావాలని సీఈఓ కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



ఆదోని సెంట్రల్: స్థానిక అర్‌ఎస్ యార్డ్ దగ్గరలో రైల్వే ట్రాక్ దగ్గర రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని వయస్సు 35 సంవత్సరాలు ఉంటుంది. మృతునికి సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు దొరక లేదని రైల్వే ఎస్‌ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, వివరాలు తెలిస్తే 9849157634కు ఫోన్ చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత అత్రితనయ గౌడ్ మృతి

- సంతాపం తెలిపిన ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి


అత్రితనయ గౌడ్ (ఫైల్)

కౌతాళం/కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ నేత బీఆర్ అత్రితనయ గౌడ్ (60) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందాడు. ఆదోని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దివంగత బీఆర్ దత్తత్రేయ గౌడ్ మూడో కుమారుడు అత్రితనయ గౌడ్. బదినేహాల్ గ్రామానికి చెందిన ఈయన వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కౌతాళం మండల వ్యవసాయ సంఘం అధ్యక్షుడిగా, బదినేహాల్ సింగిల్ విండో అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈయనకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఎన్నికల ముందు చేపట్టిన పాదయాత్రలో ఆయన వెంట నడిచారు. ప్రస్తుత ఎన్నికల్లో మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి గెలుపు కోసం కౌతాళం మండలంలో కీలకంగా వ్యవహరించారు. అత్రితనయ గౌడ్ మృతి పట్ల మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎమ్మెల్సీ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన సంఘం నాయకుడు వై. ప్రదీప్ రెడ్డి, ఉరువకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, ఆదోని జనసేన నాయకుడు మల్లప్ప, ఎంపీపీ అమ్రేష్, కౌతాళం సింగిల్ విండో అధ్యక్షుడు దాట్ల క్రిష్ణం రాజు, మాజీ అధ్యక్షులు వీరసేనా రెడ్డి, అడివప్ప గౌడ, వైఎస్ ఎంపీపీ బుజ్జిస్వామి, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు చైర్మెన్ నాగరాజు గౌడ, మాజీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, చెన్నబసప్ప, కోఆప్షన్ మెంబర్ మాబు సాబ్ , వివిధ పార్టీల నాయకులు బదినేహాల్‌కు తరలివచ్చి నివాళులర్పించారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు, అభిమానులు, వేలాది మంది గ్రామస్తుల మధ్య అత్రితనయ గౌడ్ అంత్యక్రియలు శనివారం సాయంకాలం నిర్వహించారు.


నివాళులర్పిస్తున్న ప్రజలు, నాయకులు